క్లుప్తంగా

నేటి నుంచి సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ

పిట్టలవానిపాలెం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 14వ తేదీ వరకు గ్రామ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి రమణ మూర్తి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పారిశుద్ధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధి దీపాలు, పలు అంశాలపై 3 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ జరుగుతుందని తెలిపారు.

22న కాపు సేవా సమితి డివిజన్ సర్వసభ్య సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని పత్తిపాటి సీతారామ యోగిని కల్యాణ మండపంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు కాపు సేవా సమితి 15వ వార్షిక సమావేశం నిర్వహించనున్నట్లు సమితి డివిజన్ నాయకులు వీవీ సుబ్బారావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తారని చెప్పారు. 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో 500ల మార్కులు, ఇంటర్మీడియట్‌లో 80 శాతానికి పైగా, ఇతర కోర్సుల్లో 85 శాతానికి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఉపకార వేతనాలు పొందదలచిన విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు రేపల్లె పట్టణం, 26వ వార్డు మేదర వీధిలోని కొలసాని శివశంకరరావుకు దరఖాస్తులను అందజేయాలని చెప్పారు. పూర్తి వివరాలకు 82478 94595, 94404 76595 నంబర్లను సంప్రదించాలని చెప్పారు.

ఆలయంలో.. అన్న ప్రసాద వితరణ



భట్టిప్రోలు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆయన ద్వితీయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహ వచనం, నాగవల్లీ దళాలతో విశేష అర్చన, అఖండ కర్పూర హారతి వంటి కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం నిర్వహించిన అన్న ప్రసాద వితరణలో కులమతాలకు అతీతంగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ, భక్త బృందం కార్యక్రమాలను పర్యవేక్షించింది.

బాపట్ల సర్కిల్ సీఐగా బి.హరికృష్ణ



బాపట్లటౌన్: బాపట్ల రూరల్ సర్కిల్ సీఐగా బి. హరికృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు రేంజ్ కార్యాలయం వీఆర్ నుంచి బదిలీపై బాపట్ల సర్కిల్ సీఐగా వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన హరికృష్ణ 2012లో సీఐగా పదోన్నతి పొందారు. చట్టాలను అతిక్రమించే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

నిజాంపట్నం ఎస్‌ఐగా తిరుపతిరావు



నిజాంపట్నం: నిజాంపట్నం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా కె.తిరుపతిరావు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదీలీల్లో భాగంగా ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసరావు వీఆర్‌కు వెళ్లారు. జె.పాంగులూరు ఎస్‌ఐగా చేస్తున్న తిరుపతిరావు ఇక్కడికి వచ్చారు.

అన్న క్యాంటీన్‌కు పసుపు రంగు సరికాదు



బాపట్ల: బాపట్ల పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు పసుపు రంగు వేయడం సరికాదని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు జోగి రాజా పేర్కొన్నారు. ఈ నెల 15న ప్రారంభిస్తామని చెబుతున్న అన్న క్యాంటీన్‌కు ఒక వైపు ఎన్టీఆర్, మరోవైపు చంద్రబాబునాయుడు ఫోటోలు ఉంచడాన్ని తప్పుబట్టారు. గతంలో వైఎస్సార్ సీపీ రంగులు వేసుకుంటున్నారంటూ హైకోర్టును ఆశ్రయించిన చంద్రబాబునాయుడు ఇప్పుడు ఏ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటిన్లకు రంగులు వేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే రంగులు తొలగించకపోతే కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు.

రైతుల గుండెల్లో వరదలు..

- ఏటా వరదతో పొటెత్తుతున్న కృష్ణమ్మ
- కోతకు గురవుతున్న పంట భూములు
- కళ్లెదుటే రేవులో కలిసిపోతున్న వైనం



ఓలేరు పల్లెపాలెం వద్ద కోతకు గురైన పసుపు పంట పొలం

భట్టిప్రోలు: కృష్ణమ్మ బిరబిరా పరవళ్లు తొక్కుతుంటే.. పరీవాహక లంక గ్రామాల రైతుల గుండెల్లో రైళ్లతో పాటు ఏటా వరదలూ పరుగులు తీస్తున్నాయి. కృష్ణ జిల్లా ప్రకాశం బ్యారేజ్ దిగువకు ఆదివారం ఉదయం 3.21 లక్షలు.. సాయంత్రం 2.53 లక్షల క్యూసెక్కులకు వరద నీరు చేరింది. గత ఐదారేళ్లుగా వరదలు లంక గ్రామాలను ముంచెతుత్తున్నాయి. దీంతో రైతులు బిక్కుబిక్కుమంటూ దేవునిపై భారం వేసి సాగుకు సమాయత్తమవుతున్నారు. వరదలు వచ్చినప్పుడు మండలంలోని ఓలేరు, పల్లెపాలెం పక్కనే ఉన్న రేవులో నీరు పారుతుంది. దీంతో పంట భూములు కోతకు గురవుతున్నాయి. ఏటా వరదల కారణంగా పంట భూములు రేవులో కలిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెపాలెం వద్ద 10 మందికి రైతులకు చెందిన 30 ఎకరాల పంట భూమి ఉండగా అది నేడు 15 ఎకరాలకు చేరిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తమ బాధ ఎవరికి చెప్పాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. పెదపులివర్రు, గొరిగపూడి, రేపల్లె ప్రాంతాలకు చెందిన రైతుల పంట పొలాల్లో పసుపు, కంద, మొక్కజొన్న, కూరగాయలు పండిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

వరుసగా వరదలు రావడంతో రేవుని ఆనుకుని ఉన్న భూములు పటిష్టతను కోల్పోయి కోతకు గురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. పల్లెపాలెంలోని రేవు అంచున నివాస గృహాలు కూడా కోతకు గురవుతున్నాయి. వరదల ప్రభావం లేకపోతే భూములకు దన్నుగా చెట్టు, చేమ పెరిగి పటిష్టంగా ఉంటాయని చెబుతున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటే గట్టెక్కుతామని రైతులు వాపోతున్నారు.

లంక గ్రామాల రైతుల్లో కలవరం

కృష్ణానదికి వచ్చిన వరదలు రైతులకు తీరని వ్యథ మిగులుతోంది. ఈసారి కూడా అదే రీతిలో వరద ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. వరద తగ్గినట్లు కనిపించినా..మళ్లీ ఉద్ధృతి పెరిగింది. ఏటా జూలై, ఆగస్టులో వరదలు వస్తున్నాయి. ఓలేరు పల్లెపాలెం వద్ద 12 అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. పరిస్థితిని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో టి.ఊహారాణి ఆధ్వర్యంలో వీఆర్వోలు మంద్రు జక్రయ్య, రాంబాబు, శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు బి.పుష్పలత, ఎ.శ్రీదేవి, సచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు సమీక్షిస్తున్నారు.



ఓలేరు పల్లెపాలెం వద్ద సిద్ధంగా ఉంచిన నాటు పడవలు

సేవాతత్పరతకు ప్రతీక ఆర్యవైశ్యులు

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు



నూతన కమిటీ పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులు

రేపల్లె రూరల్: త్యాగాలకు, సేవాతత్పరతకు ప్రతీక ఆర్యవైశ్యులని ఆర్యవైశ్య సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు తూనుగుంట్ల శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం 2024–26 సంవత్సరాలకు గాను నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం పట్టణంలోని వాసవీ కల్చరల్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సిద్ధికై చివరి వరకు శక్తి వంచన లేకుండా బ్రిటీష్ వారితో నిర్వహించిన పోరాటాల్లో మహాత్మగాంధీ పాల్గొనగా, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు తన జీవితాన్ని త్యాగం చేసి అమరజీవిగా నిలిచారన్నారు. రాష్ట్రముఖ్యమంత్రిగా తన వంతు సేవలను కొణిజేటి రోశయ్య అందించారన్నారు. అన్ని రంగాల్లో ఆర్యవైశ్యులు ముందుంటారన్నారు. తొలుత ఓల్డ్ టౌన్‌లో మహాత్మగాంధీ, శ్రీ పొట్టి శ్రీరాములు, కొణిజేటి రోశయ్య విగ్రహాలకు నివాళులర్పించి, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి విగ్రహానికి నూతన కమిటీ సభ్యులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన కమిటీ సభ్యులు..

సంఘ పట్టణ అధ్యక్షుడిగా కాశేపల్లి ఈశ్వరబాబు ప్రమాణ స్వీకారం చేశారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా తడికమళ్ళ బలరామ శ్రీనివాసు (బాలు), కోశాధికారిగా తూనుగుంట్ల రాజేష్, ఉపాధ్యక్షులుగా పొన్నూరు మల్లికార్జునరావు, వంకాయల వెంకట రామకృష్ణ, పొన్నూరు శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శులుగా యెండూరి శివరామకృష్ణ, మానేపల్లి వెంకట సాయి మల్లికార్జునరావు, వేముల రామకోటేశ్వరరావు, అదనపు కోశాధికారిగా గుర్రం సురేష్‌కుమార్, గౌరవాధ్యక్షుడిగా మట్టుపల్లి సుబ్బారావు, మరో 27 మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు పెండేలా సుబ్బారావు, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ వీరబ్రహ్మేంద్రస్వామి, కౌన్సిలర్ బి.సత్యనారాయణ, ఆర్యవైశ్య నాయకులు మద్ది పద్మజ, పొన్నూరు గౌరీరామకుమారి, ఎంబీఎల్ నారాయణ మూర్తి, ఆలపాటి వేణుగోపాలరావు, సుగ్గల సుదర్శనరావు, యెండూరి ఆదిశేషగిరిరావు, నంబూరు సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ సీఐగా కె.గంగాధర్



బాపట్లటౌన్: బాపట్ల రూరల్ సీఐగా కె. గంగాధర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. 1996 బ్యాచ్‌కు చెందిన గంగాధర్ 2014లో సీఐగా పదోన్నతి పొందారు. గతంలో 18 సంవత్సరాలపాటు హైదరాబాద్‌లో విధులు నిర్వర్తించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రాకు వచ్చారు. సీఐగా ఇంటిలిజెన్స్, సీఐడీలతో పాటు గిద్దలూరు, మార్కాపురం, అమరావతి స్టేషన్లలో పనిచేశారు. ప్రస్తుతం తిరుపతిలో రెడ్ శాండిల్ టాస్క్‌ఫోర్స్ నుంచి బదిలీపై బాపట్ల రూరల్‌కు వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు.

చెరుకుపల్లి ఎస్‌ఐగా అనిల్ కుమార్



చెరుకుపల్లి: చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా టి.అనిల్‌కుమార్ ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో చందోలు పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించారు. ఇప్పటి వరకు చెరుకుపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన వై.సురేష్ కొరిశపాడు పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా నూతన ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వతావరణం ఉండాలంటే శాంతి భద్రతలకు ఆటంకం కలిగించకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. స్టేషన్ సిబ్బంది ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

చందోలు ఎస్‌ఐగా ఆర్.స్వామి శ్రీనివాస్



పిట్టలవానిపాలెం: చందోలు ఎస్ఐగా ఆర్.స్వామి శ్రీనివాస్ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ టి.అనిల్‌కుమార్ చెరుకుపల్లి బదిలీపై వెళ్లారు.

పెరిగిన వరద ఉద్ధృతి



వరద ప్రవాహం

రేపల్లె రూరల్: ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో పెనుమూడి కృష్ణానది వద్ద వరద ఉద్ధృతి కొద్ది శాతం పెరిగింది. 2.50లక్షల క్యూసెక్కుల వరద నీరు నిలకడగా ప్రవహిస్తూ ఆదివారం సాయంత్రంకు 3.23 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో అధికారులు ఘాట్‌కు చేరుకుని వరద నీటితో పాటు లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసరావు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని చెప్పినట్లు తెలిపారు. ఇప్పటికే పునరావాస కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.



పెనుమూడి వద్ద కృష్ణానది వద్ద వరద ఉద్ధృతి పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనివాస్





అధ్వానంగా రహదారులు

మండలంలోని పలు ప్రధాన రహదారులు అధ్వాన స్థితికి చేరడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతం. ముఖ్యంగా పెనుమూడి కరకట్ట రోడ్డుతో పాటు పిరాట్లంక - గంగడిపాలెం రోడ్డు, గంగడిపాలెం నుంచి మోళ్లగుంట వెళ్లే ప్రధాన రహదారి పలుచోట్ల గుంతలుపడి దెబ్బతిన్నాయి. ఈ రహదారులలో భారీ గోతులు ఉండటంతో ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రయాణ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల్లో నీరు నిలబడి, వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. నిత్యం ఈ రహదారుల నుంచి పట్టణానికి వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రహదారులను అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. - రేపల్లె రూరల్







అంబేడ్కర్ స్మృతి వనంపై దాడి హేయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న దళిత నాయకులు

కర్లపాలెం: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనంపై దాడి చేయడం హేయమైన చర్య అని, అంటరాని తన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ జి.చార్వాక అంబేడ్కర్, యువజన సేవా సమాఖ్య అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షుడు ధనుంజయ్‌రావు, పరమానందకుమార్ ఖండించారు. విజయవాడ నగరంలోని అంబేడ్కర్ స్మృతి వనంపై గుర్తుతెలియని దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ.. దళిత నాయకులు ఆదివారం కర్లపాలెం సెంటర్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. నల్ల రిబ్బన్లతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దోషులను అరెస్ట్ చేసి, చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాగిత కోటేశ్వరరావు, గుంపుల కన్నయ్య, విజయరాజు, మల్లెల వెంకటేశ్వర్లు, బెజ్జం వెంకటేశ్వర్లు, గొర్రుముచ్చు మీరయ్య, జి.వందనం, రాజేష్, ఇర్మియా, ధర్మేంద్ర, ఆనందబాబు, ఇమ్మాని యేలు, బెనర్జి, యారం ఇసాక్, పద్మారావు, జీవన జ్యోతి, అమీర్‌బేగ్, శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

అరటి బొత్తల కషాయం తయారీ ఇలా..



అరటి బొత్తల కషాయం తయారీ

పిట్టలవానిపాలెం: వరి పైరులో అరటి బొత్తల కషాయంతో పొటాషియం లోపాన్ని సరిచేయవచ్చని ఐసీఆర్‌పీ చేబ్రోలు ఏసోబు తెలిపారు. మండల కేంద్రంలో సుస్థిర సేంద్రియ వ్యవసాయంలో భాగంగా అరటి బొత్తల కషాయాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలో అరటి బొత్తలు, కిలో నల్ల బెల్లం ముక్కలుగా చేసి ప్లాస్టిక్ డ్రమ్ములో 30 రోజుల పాటు మురగనీయాలని తెలిపారు. 30 రోజుల తర్వాత లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి ఎకరానికి 600 ఎంఎల్‌ను పిచికారీ చేయడం వల్ల పొటాషియం లోపం నిర్మూలించవచ్చని వివరించారు. ఈ కషాయాన్ని స్వయంగా, తక్కువ ఖర్చుతో చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుస్థిర సేంద్రియ వ్యవసాయ సిబ్బంది ప్రవళిక, వెంకటరెడ్డి, రైతులు ఉన్నారు.

రూ.48 వేలకు చీరల వేలం



వంట శాల నిర్మాణానికి భూమిపూజ



చీరల బహిరంగ వేలం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి భక్తులు కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించిన చీరల బహిరంగ వేలం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బాపట్ల ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో 200 చీరలు వేలం నిర్వహించగా రూ.48,700ల ఆదాయం లభించినట్లు తెలిపారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటశాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆలయ సిబ్బంది, భక్తులు ఉన్నారు.

మత్స్యకార గ్రామాల్లో విద్యాభివృద్ధికి కృషి



బ్యాగులను పంపిణీ చేసిన డైరెక్టర్ సురేష్‌బాబు

బాపట్ల: మత్స్యకార గ్రామాల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎస్ టూ నీడ్స్ సంస్థ డైరెక్టర్ తోట సురేష్‌బాబు తెలిపారు. అడవిపల్లిపాలెం గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోట సురేష్‌బాబు మాట్లాడుతూ ఏటా మత్స్యకార గ్రామంలో ప్రతి విద్యార్థికి చదువు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దాతలు ముందుకు రావాలని కోరారు. 2021 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గోగు శివ, సిరిపిల్లి సత్యవతి, పిక్కి కుమార్, చోడిపల్లి భాగ్యవతి, తిర్రి ద్రాక్షావలి పాల్గొన్నారు.

'వేస్ట్' ఆలోచన



పెసర్లంక శివాలయం సమీపంలో బంక మట్టితో కూడిన ఇటుక ముక్కలు



పెసర్లంక అడ్డరోడ్డు వద్ద బంకమట్టి, ఇటుక ముక్కలతో పూడ్చిన గుంత

కొల్లూరు : మండలంలోని కొల్లూరు పెసర్లంక మీదుగా తొమ్మిది లంక గ్రామాలకు వెళ్లే రహదారి పరిస్థితి దయనీయంగా మారింది. రోడ్డు మొత్తం భారీ గోతులతో నిండిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు నాలుగు వేల మంది ప్రయాణానికి, వ్యవసాయోత్పత్తులు, ఇటుకరాయి రవాణాకు ఇదే ప్రధాన మార్గం. భారీ గుంతలతో కూడిన ఆర్అండ్‌బీ రోడ్డుకు పాలకులు మరమ్మతులు చేపట్టడం లేదు. గుంతలను పాత ఇళ్లు కూల్చిన ఇటుక రాళ్ల ముక్కలతో పూడ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. గుంతలను పూడ్చడానికి వినియోగిస్తున్న ఇటుకరాళ్ల ముక్కలు సైతం బంకమట్టితో నిండి ఉండటంతో వర్షాలు కురిసిన సమయంలో వాహనాలు జారీ.. ప్రమాదాల బారిన పడుతున్నారు.

మద్యం మత్తులో లారీని ఢీకొట్టిన వాహనదారుడు



లారీని ఢీకొట్టి, అక్కడే కూర్చుకున్న క్షతగాత్రుడు

కొల్లూరు : మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలైన ఘటనం మండలంలోని చిలుమూరు–ఈపూరు గ్రామాల మధ్య కరకట్టపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రేపల్లె నేతాజీ నగర్‌కు చెందిన చిలక పాల్ ఆదివారం రేపల్లె నుంచి విజయవాడ ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అప్పటికే మద్యం సేవించి ఉన్న అతను ఎదురుగా వస్తున్న లారీకి ఎదురువెళ్లాడు. ఇది గమనించిన లారీ డ్రైవర్ లారీని రోడ్డు మార్జిన్‌కు వెళ్లి నిలిపాడు. అయినా.. ద్విచక్ర వాహనదారుడు లారీని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. లారీ డ్రైవర్ అప్రమత్తంగా లేకుంటే ప్రమాదానికి గురైన వ్యక్తి ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చేదని స్థానికులు పేర్కొన్నారు. క్షతగాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

▪ నేడు సర్వసభ్య సమావేశం

కొల్లూరు: మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీ కుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కమ్మెల చారమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో పలు ప్రభుత్వ శాఖల అభివృద్ధిపై సమీక్ష చేయనున్నట్లు తెలిపారు.